# సరి సరి మాటల మూటా!

మాట్లాడే ప్రతి మాటకి "సెన్స్" ముఖ్యం అంటారు గదా! కాని అంతా, అన్నివేళలా "సెన్స్" పాటించరు. ఏదో మాట్లాడాలి గదా అని మాట్లాడటం మన జీవితాల్లో ఎక్కువ. "ఏమండీ కులాసా" - "ఆ—ఏదో తమ దయవల్ల" "అంతా బావున్నారా ?" — "బావున్నారు బావున్నారు" "చిక్కిపోయారేవిటి?" "భోజనం అయిందా ?" ఇవన్నీ కుశల ప్రశ్నలు ఇక భోగట్టాలు అంటే సమాచార సేకరణ....దాంట్లో "హం! ఎంత వెనకేశారేవిటి?" "అల్లుడేం చేస్తున్నాడు? తిన్నగావుంటున్నాడా?"—"మీ పెద్దమ్మాయి కాపురం చక్కబడిందా?"—"కట్నం ఎంత?" "ఏం పెట్టారు?"—"ఇంక్రిమెంటు ఎరియర్స్ వచ్చాయా?"——"సోఫా కంబెడ్ కొన్నారా?"-"ఎందుకండీ శుద్ధ దండగ"— యిలా వుంటాయి భోగట్టాలు. మనం ఏం తింటున్నామో, ఎలా జీవిస్తున్నామో, ఎప్పుడెప్పుడు మనకి ఎలాఎలాంటివి జరుగుతున్నాయో. మనింటి కెవరువస్తూ పోతున్నారో అన్నీ కావాలి. అంచేత మన జీవితకాలంలో చాలాభాగం వ్యర్థ ప్రసంగాలతోనూ, ఆ మిగిలిన కాలం కళ్ళుమూసుకు మంచంమీద బోర్లా పడుకోవటంతోనూ గడిచి చక్కాపోతుంది.

సంభాషణని పొడిగించటం కోసం కొన్ని అనాలి సొస్తుంది. "ఆ ఏమంటున్నారు?"—"మళ్ళీ చెప్పండి" "అబ్బో అలాగా?"-"దానిదేముంది లెండి"—"అయ్యో పాపం—రామ! రామ!, హరి హరీ కృష్ణ కృష్ణా విన్లేను విన్లేను" అని సందేహం, సానుభూతి ఒలకపోస్తూ వుంటాము. అంత


రాంతరాల్లో మనకెవరి క్షేమమూ అక్కర్లేదు. మన క్షేమం మన లాభం మన సుఖం ప్రపంచానికి మేలు కలిగించకపోయినా ఫరవాలేదు. మనిషి అంతరాంతరాల్లో వేరేలోకం వుంటుంది. అందులో అతగాడు కానీ ఆవిడ కాని జీవిస్తూంటారు. ఈ మనో ప్రపంచపు టావర్తాలు తెలుసుకోగలిగితే, మరో ప్రపంచపు టావర్తాలు కూడా తెలుస్తాయి. అంతరంగంలో మనిషి ఒంటరివాడు. ఒంటరితనం ఒకప్పుడు పరమ డేంజరస్సూ, ఒకప్పుడది పరమ ప్రయోజనకారీనూ. ఒకరికది వరం, మరొకరికది శాపం, జపం విడిచి లొట్టల్లో పడ్డట్టున్నాము.

అర్థంలేని మాటల్ని గురించి మనం విన్నప్పుడు మాట్లాడుకుంటు న్నామా—ఈ మాటలు టైమునీ స్పేసునీ కూడా తింటాయి. మాటలు కాలం లోకి వ్యాపించి అందులో కలిసి పోతాయి కూడా. శబ్దమే ముందు పుట్టింది అన్నారుకదా పెద్దలు. అంతకుముందు నిశ్శబ్దమే రాజ్యాలు ఏల్తూవుండాలి. శబ్దాలకు అర్థాలు నానార్థాలూ విపరీతార్థాలు తరవాత్తరవాత పుట్టుకొచ్చాయి. శబ్దానికీ శబ్దానికీ మధ్య వుండవలసిన నిశ్శబ్దాన్ని విరామం అంటాము. ఆ విరామ చిహ్నాలుగా కామాలు, ఫుల్‌స్టాపులు, కోలన్లూ, సెమికోలన్లూ డాష్‌లూ పుట్టుకొచ్చాయి. పంక్చుయేషన్ అంటాము. పంక్చుయేషన్ అంటే నిశ్శబ్దాన్ని ఏలుకోవడమే ననుకుంటాను. కాలం లేనిచోట శబ్దం వుంటుందా, వుండదా? మనిషికాని మరో జీవికాని చెట్టూ చేమా కాని లేని చోట కాలమూ, శబ్దమూ రెండూ కూడా అర్థంలేని మాటలై కూర్చుం టాయి. మళ్ళీ మరో జపం విడిచి మరో లొట్టలు వేస్తున్నట్టున్నాము.

బైదిబై—మాటకి ఒక హూపునూ కొంత శక్తినీ మరికొంత రక్తినీ యివ్వటం కోసం సంభాషణల్లో నైతేనేమీ వ్రాతకోతల్లో నైతేనేమీ కొన్ని ఊతపదాల్ని ప్రయోగిస్తూ వుంటాము. కొన్నిటికి అర్థాలున్నాయి. కొన్నిటికి లేవంటే లేవు.

మేం చిన్నప్పుడు ఇళ్ళలో కొన్ని మాటల్ని పట్టుకు యిష్టం వచ్చి నట్లు వాడేసేవాళ్ళం. పెద్దాళ్లు విసుక్కుని తన్నడం దాకా వస్తే కాని ఆ మాటల్ని వాడటం మానలేకపోయేవాళ్ళం. అందులో ఒకటి "పోదూపేద్ద"

"పెద్ద చెప్పొచ్చావ్" "పెద్ద మాట్లాడకు", ఇలాగే కొన్నాళ్ళు "గొప్ప" అనే మాటను "గొప్ప మాట్లాడేస్తోంది", "గొప్ప చదివేస్తోంది", "గొప్పగా వుంది" అంటూ యీ గొప్పను నాలిక్కటించుకుని తిరిగే వాళ్ళం. మా చుట్టం వొకావిడవుండి. ఆవిడ అన్నిటికీ "జాన్దేవు(జానేదో)" అని అంటూ వుంటుంది. ఇంకో పెద్దావిడ "అయ్యో నా మొహం మండ" అంటూ వుండేది. కొంతమంది "ఆఫ్ కోర్స్"–"ఐసీ"– "ఓకె" అన్నట్లు గానే "మాట వరసకి", "చెప్పొచ్చే దేవిటంటే" – "అయిన కాడికి", "ఇంతకీ", "ఇప్పుడు సమస్య ఏమిటంటే", బై ఆల్ మీన్స్" "యస్.




యస్" అంటూ వుంటారు. "తథాస్తు", "బై ది బై", "కమింగు టు ది పాయింటూ", "తీరా ఏవిటంటే" ఇవన్నీ లేకుండా మాట్లాడ్డం చాలా కష్టం. రాయటం కూడా అంతే కష్టం అనుకోండి. తెలుగు నేర్చుకునే ఇతర భాషలవారు ఇతర దేశీయులు చచ్చినా యీ ఇడియంను అర్థం చేసుకోలేరంటే నమ్మండి!

ఎవరూ పోకుండానే అస్తమానూ "పోతే పోతే" అంటూ ఉపన్యసించేవారున్నారు. ఉపన్యాసకుడికి వూత పదాలు అవసరమైన పనిముట్లు. సారాంశం జారిపోకుండా వుండగలందులకు యీ వూతపదాలు కవిత్వంలో

కూడా అవసరమే. పూర్వం "అనవుడు– నావుడు" అని యిప్పరన్నదమ్ము లుండేవాళ్లని మనం తెలుసుకున్నాం కూడా.

మా వారి ఫ్రండొకాయన అన్నిటికీ "టాపులేచిపోయింది" అంటూ వుండేవాడు. గొప్పగా రాశార్సార్ టాపు లేచిపోయింది అనేవాడు. ఎండ ల్సార్ టాపు లేచిపోతున్నాయి. అబ్బ ఏవి యాక్టింగంకీ టాపు లేచి పోయింది అంటూ టాపు లేచిపోకుండా మాట్లాడే వాడుకాదు. కొన్ని తిట్లు కూడా వూతకు పనికొస్తాయి —

"డాబు, బడాయి, పోదూ, వాల్లెస్తురూ, వాల్లే" వీటితోబాటు యువ జనులువాగే రెండు మాటలున్నాయి అవి "తగ్గు తగ్గు"– "కొయ్ కొయ్" కోతలు అన్న పదంతో తులతూగకల అన్య దేశీయాలు చాలా తక్కువ వుంటాయి. కొన్ని కొన్ని కొత్త కొత్త పద ప్రయోగాలు స్టూడెంట్సు హాస్టల్స్‌లోనూ, తరగతి గదుల్లోనూ పుట్టుకొచ్చి అక్కడి కక్కడే వాటికి చాలామణీ ప్రారంభమవుతుంది.

"సరిసరీ", "అవునవును", "బలే బలే", ఇవి లేకుండానూ మాట్లాడ్డం కష్టం. అమ్మ పేరుమీద వచ్చే బూతు పదాలను ఉచ్ఛరించ డానికే వీల్లేదనుకోండి. పురుషుని పరంగా వచ్చే తిట్లకంటె స్త్రీ పరంగా వచ్చే తిట్లకే గిరాకీ ఎక్కువ. మనం చెప్పుకునే సంప్రదాయంలో సంస్కృతిలో యివి జీర్ణమైపోయి వున్నాయి. బూతులన్నీ ఆడవాళ్ళను హేయపరిచి అవమానపరిచి కించపరిచేవేకదా! ఇప్పటిదాకా గురూ శబ్దం మగాళ్ళమీదే ప్రయోగిస్తున్నారు. ఇది ఉభయత్రా వాడుతున్న మహానుభావులు కూడా వున్నారు.

గురూ వంటచేశావా, గురూ సినిమాకెళ్దాం చీరకట్టుకో, గురూ ఒక టూ రుపీస్ వుంటే యివ్వు, గురూ ఆ లైట్ తీసెయ్ అని భర్తలు భార్య

లను అనకుండా వుంటున్నారా — అంటారంటారు. అన్నట్లు "గిర" అనే మాటకూడా చాలా గిరగా వాడుతూ వుంటారు.

స్టూడెంట్సు సినిమా ప్రేక్షకులు పాఠకులు వారు వీరననేల అంతా యిప్పుడు "బోరు" శబ్దాన్ని విరివిగా ప్రయోగిస్తున్నారు. అబ్బా ఆ కథలు బోరండీ, ఆవిడ నవలలు బోరండీ, యీ సినిమా బోరండీ అంటూ అన్నీ పరమబోరుగా వున్నట్లు అభిప్రాయాలు వ్యక్తంచేసే ఒక తరం ప్రజలు తయారవుతున్నారు.

ప్రపంచం మీకు బోరుగా వుంటే మరి మీరు ప్రపంచాని కెంత బోర్‌గా వుంటున్నారో కూడా కాస్త ఆలోచించండి.